



# కరపత్రం

SINCE 2014

మంగళవారం జనవరి 7 2025 | సంపుటి :0 | సంచిక : 87 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


# చర్లపల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం



## కేంద్రం సహకరిస్తే ట్రిలియన్ ఎకానమీ ప్రధాని మోడీకి సీఎం రేవంత్ వినత

కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం చర్లపల్లి టెర్మినల్‌ను ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ గా పాల్గొన్నా సిఎం రేవంత్.. ప్రధాని మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్.. డ్రైపోర్టు ఇవ్వాలని ప్రధానిని కోరుతున్నాని అన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి, మెట్రో రైలు విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. చర్లపల్లి టెర్మినల్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైల్వే టెర్మినల్ పూర్తి చేసినందుకు ప్రధానికి తెలంగాణ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. బందర్ పోర్ట్‌కు రైల్వే లైన్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. తెలంగాణలో డ్రైపోర్ట్ ఏర్పాటు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెలంగాణ ఫార్మా ఇండస్ట్రీకి కేరాఫ్ అడ్రస్‌గా ఉందన్నారు. ఎలక్ట్రిక్ వేహికిల్ తయారీకి అనుమతి ఇవ్వాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు 374 కిలోమీటర్ల నిర్మాణం జరుగుతోందని.. రీజనల్ రైల్ అవసరం కూడా ఉందన్నారు. రైల్ రింగ్‌కు అనుమతి ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. వికారాబాద్ నుంచి కొడంగల్ మీదుగా కర్ణాటకకు రైల్వే లైన్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రధాని కోరుకుంటున్న 5 ట్రిలియన్ ఎకానమీ సకారం కావాలంటే అన్ని రాష్ట్రాల అభివృద్ధి జరగాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా ఇందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటుందన్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటు చేస్తే రాష్ట్రాభివృద్ధికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. 1 ట్రిలియన్ ఎకానమి కాంట్రిబ్యూట్ చేసేందుకు తమకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని ప్రధాన మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాగా.. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్‌లపై ఒత్తిడి తగ్గించి, నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నాల్గో టెర్మినల్‌గా చర్లపల్లి రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే. ఆరున్నరేళ్ల కాల వ్యవధిలో దాదాపు రూ.428 కోట్లతో నిర్మితమైన ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది. అలాగే జనవరి 7 నుంచి సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ (12757-12758), గుంటూరు- సికింద్రాబాద్- గుంటూర్ ఎక్స్‌ప్రెస్ (17201-17202), సికింద్రాబాద్- సిర్పూర్ కాగజ్‌నగర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17233-17234) రైళ్లకు చర్లపల్లిలో అదనపు స్టాపేజ్ ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ స్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లి వచ్చే రైళ్లు (12603-12604) మార్చి 7 నుంచి,. గోరఖ్‌పూర్- సికింద్రాబాద్ వెళ్లి వచ్చే రైళ్లు (12589-12590) మార్చి 12 నుంచి చర్లపల్లి టెర్మినల్ నుంచే రాకపోకలు సాగిస్తాయని అధికారులు చెప్పారు.

## : హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసుల ప్రారంభం





హనుమకొండ: హనుమకొండలో ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ , కొండా సురేఖ జెండా ఊపి సర్వీసులను ప్రారంభించారు. అనంతరం మంత్రులు, ప్రజాప్రతినిధులు బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు మంత్రులు తెలిపారు.

## ఆరాంఘర్- జూపార్క్ పైవంతెనను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



2లో

హైదరాబాద్: ఆరాంఘర్- జూపార్కు పైవంతెనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నగరం నుంచి బెంగళూరు హైవేకు ఉన్న ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు జూపార్కు నుంచి ఆరాంఘర్ వరకు 4.08 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.800 కోట్లతో ఈ పైవంతెనను బల్దియా నిర్మించింది. గతేడాది డిసెంబరులో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసినా కొన్ని కారణాల వల్ల నిలిచిపోయింది. దీంతో కొన్ని రోజుల క్రితం 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది.

## కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది : కేటీఆర్

- గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్ఎస్ పార్టీకి రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.
- గ్రీన్‌కో 2022లో ఎన్నికల బాండ్లు ఇచ్చింది.
- 2023లో ఫార్ములా ఈ రేసు జరిగింది.
- కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో బాండ్లు ఇచ్చింది.



2లో

ఫార్ములా ఈ రేసు కారణంగా గ్రీన్ కో నష్టపోయింది. అందుకే మరుసటి ఏడాది స్పాన్సర్‌షిప్ నుంచి తప్పుకుంది. అది క్విడ్ ప్రోకో ఎలా అవుతుంది..? ఇది రేవంత్ రెడ్డి టీం చేస్తున్న దుష్ప్రచారం. పార్లమెంట్ ఆమోదించిన ఎన్నికల బాండ్లు అవినీతి ఎలా అవుతుంది. దేశ వ్యాప్తంగా అన్ని పార్టీకు వచ్చిన బాండ్లపై చర్చకు సిద్ధం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఫార్ములా ఈ కార్ రేసింగ్ నిర్వహించిన గ్రీన్‌కో సంస్థ ద్వారా బీఆర్ఎస్‌కు రూ. కోట్ల లబ్ధి చేకూరినట్లు ప్రభుత్వం పేర్కొంది. బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా రూ. 41 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు 26 సార్లు బాండ్లు కొన్నట్లు తెలిపింది. 2022లో ఏప్రిల్ 8 నుంచి అక్టోబర్ 10 మధ్య బాండ్లు కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఏప్రిల్ 8న 20 బాండ్లు, అక్టోబర్ 10న 6 బాండ్లు కొన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది.

## చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

- చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేశారు.
- సాంకేతికత, అత్యాధునిక సౌకర్యాలతో రూ.413 కోట్లతో దీన్ని నిర్మించారు.
- కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొన్నారు.
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి , బండి సంజయ్ హాజరయ్యారు.
- గత ఏడాది డిసెంబరు 28న ఈ టెర్మినల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరిగాయి.
- అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంతో ఆ కార్యక్రమం వాయిదా పడింది.



2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జనవరి 7 2025

# సంపాదకీయం

## కశ్మీర్ ఫైల్స్ : విజయమూ వివాదమూ

'మేరాజూతా హై జపానీ, యే పత్లూన్ ఇంగ్లీస్తానీ, సిర్ పే లాల్ టోపీ రూసీ ఫిర్ బీ దిల్ హై హిందుస్తానీ' –బాలీవుడ్ సినిమా 'శ్రీ 420'లోని ఈ పాటలో జాతీయతా భావం ఉట్టిపడుతుంది. ఇటీవల గల్ఫ్ పర్యటనకు వచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ అబుధాబిలో తనను సన్మానించిన ప్రవాసులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆ పాట చరణాలను ఉటంకించడంలో ఆశ్చర్యమేముంది? 67 సంవత్సరాల క్రితం రాజ్‌కపూర్ నిర్మించి, నటించిన 'శ్రీ 420'లోని ఆ అజరామర పాటను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తావించడాన్ని బట్టి, అది ఇప్పటికీ భారతీయుల హృదయాలలో ఎంతగా నిలిచిపోయిందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ అభిమానాన్ని, సామాజిక ధర్మాన్ని ప్రబోధించే సినిమాలకు సహజంగానే ఆదరణ లభించడం కద్దు. ఉపకార్, సత్యం శివం సుందరం, బార్డర్ మొదలైన బాలీవుడ్ సినిమాలకు ప్రేక్షకాదరణతో పాటు ఆర్థిక విజయం కూడా లభించింది. ఇటీవలి దశాబ్దాలలో పాకిస్థాన్ ప్రేరిత ఉగ్రవాదం నేపథ్యంగా నిర్మించిన సందేశాత్మక సినిమాలూ విజయవంతమయ్యాయి. కశ్మీర్ లోయలో ఉగ్రవాద ఆరంభ దశలో విడుదలయిన 'కర్మ' (1986)కు ప్రజలు నీరాజనం పట్టారు. ఉగ్రవాదం ఊపు మీద ఉండగా ఒక ఇంజనీర్ అపహరణ ఉదంతంపై నిర్మించిన '?రోజా' (1992)నూ విశేషంగా ఆదరించారు. కర్మ, రోజా సినిమాల వీడియో క్యాసెట్లను గల్ఫ్ దేశాలలో బ్లాకులో విక్రయించి సంపాదించిన వారు ఉన్నారు! అదే విధంగా, ఫనా (2006) కూడ బాక్సాఫీసును బద్దలు కొట్టింది. ఉగ్రవాదుల అణిచివేత క్రమంలో భద్రతా బలగాల కారణంగా సర్వం కోల్పోయిన ఒక సామాన్య కుటుంబ గాథ ఇతివృత్తంగా, హృతిక్ రోషన్ నటించిన 'మిషన్ కశ్మీర్' (2000) కూడా జయకేతనం ఎగురవేసింది.

మరి, కశ్మీర్ లోయలో ఉగ్రవాదంపై నిర్మించిన వివిధ సినిమాల విషయంలో లేని వివాదం ఇప్పుడు 'కశ్మీర్ ఫైల్స్'పై ఎందుకు తలెత్తుతోంది? ఒక్క పాకిస్థానీ ఇస్లామిక్ సంకుచితవాదులే కాకుండ, ప్రత్యామ్నాయ సైద్ధాంతిక దృక్పథాలు గల భారత రాజకీయ, మేధావి వర్గాలు కూడ ఉగ్రవాద మద్దతుదారులని భాష్యం చెప్పేందుకు 'కశ్మీర్ ఫైల్స్' ప్రయత్నించింది. ఇదే, ఆ సినిమాపై వివాదాల వెల్లువకు కారణం. రాజకీయ పక్షాల విమర్శలు ఎలా ఉన్నా 'కశ్మీర్ ఫైల్స్' ఒక ప్రచార ఎత్తుగడ అని అత్యున్నత నిఘా సంస్థ 'రా' అధిపతిగా సుదీర్ఘ కాలం పని చేసి కశ్మీర్‌లో ఉగ్రవాదం అణచివేయడంలో కీలక పాత్ర వహించిన ఎ.యస్.దులాత్ వ్యాఖ్య ఈ సందర్భంగా గమనార్హమైనది. సామాజిక మాధ్యమాలు కీలకపాత్ర వహిస్తున్న ప్రస్తుత తరుణంలో భారతీయ జనతా పార్టీ తన వాదనతో ప్రత్యర్థులకు అందనంత దూరంలో అగ్రగామిగా ఉంది. తమ రాజకీయ పన్నాగంలో భాగంగా వాస్తవ గాయాలకు వక్రభాష్యం చెబుతూ ఇప్పటికే సాంస్కృతిక దాడులు చేస్తున్న ఆ పార్టీ ఇక సినిమా మాధ్యమం ద్వారా భావోద్వేగ రాజకీయాలు చేస్తే తట్టుకోవడం కష్టమని ప్రతిపక్షాలు ఆందోళన చెందుతున్నాయి. ఏ సినిమానైనా వివాదస్పదం చేసి రచ్చకీడ్చితే ప్రాచుర్యం పొందుతుంది. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'కశ్మీర్ ఫైల్స్'ను ప్రశంసించడాన్ని వివిధ వర్గాలు విమర్శిన్నాయి. అయితే దేశంలోనూ, విదేశాలలోనూ ఆ సినిమాపై విశేష ఆసక్తి వ్యక్తమవుతోంది. అమెరికా మొదలు ఆఫ్రికా వరకు 'కశ్మీర్ ఫైల్స్' జోరుగా ఆడుతున్నా దుబాయి సహా గల్ఫ్ దేశాలలో మాత్రం ఈ సినిమాను ప్రదర్శించడం లేదు. న్యూజీలాండ్‌లో అనుమతి లేకపోగా ఆస్ట్రేలియాలోని చిన్న పట్టణాలలో కూడ దీనికి డిమాండ్ పెరుగుతుంది. తొమ్మిది దేశాలలో 100 సినిమా హాళ్ళలో మొదలయిన ఈ సినిమా ఇప్పుడు 25 దేశాలలో 350కు పైగా హాళ్ళలో ప్రదర్శితమవుతోంది. సినీ వర్గాల అంచనా ప్రకారం, 10 కోట్ల రూపాయలకు మించని వ్యయంతో, మామూలు నటులతో నిర్మితమైన 'కశ్మీర్ ఫైల్స్' రూ. 300 కోట్లతో నిర్మించిన 'రాధేశ్యాం'ను బాక్సాఫీస్ వద్ద వెనక్కి నెట్టింది. ఇక సినిమా విషయానికి వస్తే, కశ్మీర్ పండితుల విషాదాలు ఇతివృత్తంగా ఈ సినిమాను నిర్మించారు. కశ్మీర్ బిడ్డలుగా అక్కడి ముస్లింలకు ఎంత హక్కు ఉందో, పండితులకు కూడ అంతే హక్కు ఉంది. వారు కూడ అసలు సిసలు భూమిపుత్రులు. లోయలో ఒక్క పండితులనే కాదు ఉగ్రవాదులను వ్యతిరేకించిన ముస్లింలను సైతం పెద్ద సంఖ్యలో హతమార్చారనేది ఎవరూ విస్మరించలేని, విస్మరించరాని సత్యం. కశ్మీర్ లోయ నుంచి భయంతో ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్ళిన వారిలో అత్యధికులు కశ్మీరీ పండితులనేది కూడ వాస్తవం.

# భారత్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్.. ఆందోళన అవసరం లేదన్న కేంద్రం



భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది.

చైనాలో హ్యూమన్ మెటానిమోవైరస్ విజృంభిస్తోన్న వార్తలు వస్తోన్న నేపథ్యంలో.. భారత్‌లోనూ ఈ కేసులు వెలుగు చూడటం కలవరపాటుకు గురిచేస్తోంది. దీనిపై స్పష్టతనిచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ.. భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఎంపీవీ ఇప్పటికే వ్యాప్తిలో ఉందని తెలిపింది. మిగతా శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే ఉంటుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది. దేశంలో ఇన్‌ఫ్లుయెంజా మాదిరి వ్యాధులు లేదా తీవ్ర శ్వాసకోశ వ్యాధులు అసాధారణ రీతిలో ఏమీ లేవని కేంద్ర ఆరోగ్యశాఖ స్పష్టం చేసింది.

"ఇతర శ్వాసకోశ వైరస్‌ల మాదిరిగానే హెచ్‌ఎంపీవీ ఉంటుంది. సాధారణ జలుబు, ఫ్లూ మాదిరి లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో, వృద్ధుల్లో ఈ ఇన్‌ఫెక్షన్ ఎక్కువగా కనిపిస్తుంది" అని కేంద్ర ఆరోగ్యసేవల డైరెక్టర్ జనరల్ డాక్టర్ అతుల్ గోయల్ పేర్కొన్నారు. సీజనల్ శ్వాసకోశ సంబంధింత కేసులను ఎదుర్కొనేందుకు అవసరమైన వైద్య సామగ్రి, పడకలు, ఇతర వసతులతో భారత్‌లోని ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శీతాకాలంలో అవసరమైన జాగ్రత్తలు వహించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మరోవైపు జన్యు పరివర్తన జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొనడం మినహాయించి హెచ్‌ఎంపీవీ వైరస్ గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం లేదని ఐసీఎంఆర్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ రామన్ గంగాఖేద్కర్ ఓ మీడియా సంస్థతో చెప్పారు. ప్రస్తుత రకం వైరస్‌తో ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు.

సాధారణ వైరస్..?

హ్యూమన్ మెటానిమోవైరస్ అనేది ఇదివరకే తెలిసిన వైరస్. ప్రపంచవ్యాప్తంగా పిల్లల్లో సంభవించే శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లలో 12శాతం వరకు ఇదే కారణమవుతోందని అంచనా. రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ )ని పోలి ఉండే ఈ వైరస్.. ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల మాదిరిగానే కనిపిస్తుంది. తక్కువ రోగనిరోధక శక్తి కలిగిన వాళ్లలోనే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. సాధారణంగా 11ఏళ్ల చిన్నారుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. తొలిసారిగా దీనిని 2001లో నెదర్లాండ్స్‌లో 28 మంది చిన్నారుల్లో గుర్తించారు.

# రద్దీ ప్రదేశాల్లో మాస్కు ధరించండి: కర్ణాటక సర్కార్ అడ్వైజరీ



హెచ్‌ఎంపీవీ వైరస్ కొవిడ్‌లా వ్యాప్తి చెందేది కాదని.. ఎవరూ భయపడొద్దని కర్ణాటక ప్రభుత్వం తెలిపింది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేసింది.

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరు నగరంలో ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఎంపీవీ వైరస్ సోకడంతో అక్కడి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్ కొవిడ్‌లా వ్యాప్తి చెందేది కాదని.. అందువల్ల ఎవరూ భయపడొద్దని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అడ్వైజరీని విడుదల చేసింది. రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని కోరింది. ఈ శ్వాసకోశ సంబంధిత వైరస్ ప్రాథమికంగా పిల్లలపై ప్రభావం చూపిస్తుందని, వారిలో సాధారణంగా జలుబు వంటి ఇన్ఫెక్షన్లకు కారణమవుతుందని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అడ్వైజరీలో పేర్కొంది. ఇన్‌ఫ్లూయెంజాలాంటి అనారోగ్యం , తీవ్రమైన ఆక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ల వంటి కేసులను రిపోర్టు చేయాలని రాష్ట్రంలోని ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది.

భారత్‌లో హెచ్‌ఎంపీవీ వైరస్ కలకలం.. ముగ్గురికి పాజిటివ్

ఈ వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు పలు సూచనలు చేసింది. ఎవరైనా దగ్గు, తుమ్మిన సమయంలో నోరు, ముక్కును కప్పి ఉంచుకోవాలని, తరచూ సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని డీఎంఈ సూచించింది. ఈ వైరస్ లక్షణాలు ఉన్నవారు, రోగులకు సన్నిహితంగా ఉన్నవారు బహిరంగ ప్రదేశాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. వాడిన టిష్యూ పేపర్లు తిరిగి ఉపయోగించొద్దని.. రుమాలు, తువ్వాలును షేర్ చేసుకోవద్దని కోరింది. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయొద్దని ప్రజలకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

డీఎంఈ తెలిపిన వివరాల ప్రకారం.. హెచ్‌ఎంపీవీ సోకితే దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది వంటి ఫ్లూలాంటి లక్షణాలు కనబడతాయి. మరింత తీవ్రమైన కేసుల్లో అయితే ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి లేనివారిలో ఇది బ్రాంకైటిస్, నిమోనియాకు దారితీయొచ్చని తెలిపింది. హెచ్‌ఎంపీవీకి నిర్దిష్టమైన యాంటీ వైరల్ చికిత్స, టీకాలు అందుబాటులో లేవన్న డీఎంఈ.. తగిన విశ్రాంతి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం వంటి చర్యలు కొంత ఉపశమనం కలిగిస్తాయని తెలిపింది. తీవ్రమైన కేసుల్లో అయితే, ఆస్పత్రిలో చేరి ఆక్సిజన్ థెరపీ, ఐవీఫ్లూయిడ్స్ అవసరమవుతాయని పేర్కొంది.

# విద్యావ్యవస్థను భ్రష్టపట్టించిన బిఆర్ఎస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే జిఎంఆర్




దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోకి వచ్చే కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బాలిక సాంఘిక గురుకుల సంక్షేమ పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ప్రారంభోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలోని సమస్యలు సోలార్ వాటర్ హీటర్ సిస్టం, లైబ్రరీ కి సంబంధించిన మెటీరియల్, ఫర్నిచర్, సామాగ్రిని కావాలని అధ్యాపక బృందం ఎమ్మెల్యే గారి దృష్టికి తేవడంతో..ఎమ్మెల్యే స్పందించి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంకిరెడ్డి పల్లి అమర్ రెడ్డిగారు, కొన్నూరు శరత్ రెడ్డి వారి ద్వారా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాఠశాల నూతన భవనం కోసం విజ్ఞప్తి చేయగా ఆమడబాకుల వద్ద ప్రభుత్వ స్థలంలో నూతన పాఠశాల భవన నిర్మాణం కోసం త్వరలో ముఖ్యమంత్రిని కలిసి భవనం మంజూరు చేయిస్తానని తెలియ చేశారు. తదనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉన్న కూడా, విద్యార్థిని, విద్యార్థుల సమస్యలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని 40 డైట్ చార్జెస్ పెంచినట్లు, బాలికల ప్రత్యేక అవసరాల దృష్ట్యా కాస్మోటిక్ చార్జెస్ పెంచినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించిందని అన్నారు, కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో బాలికల పాఠశాలలు తరగతి గదులు, టాయిలెట్స్ లేక విద్యార్థినిలు గత ప్రభుత్వంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కున్నారని, అట్టి సమస్యను ఆనాడే గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపన పోలేదని గత ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు, త్వరలో సంక్రాంతి తర్వాత పాఠశాల నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోబోతున్నామని తెలియజేశారు.

# చర్లపల్లి టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

కనెక్టివిటీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మెట్రో నెట్‌వర్క్ 1000 కిలోమీటర్లకు పైగా పరిధి విస్తరించిందని చెప్పారు. జమ్మూ కశ్మీర్, ఒడిశా, తెలంగాణలో కొత్త కనెక్టివిటీకి ఏర్పాట్లు జరిగాయని పేర్కొన్నారు.

దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది

"ఒక్కో అడుగు వేసుకుంటూ దేశంలో కొత్త పుంతలు తొక్కిస్తున్నాం. రైల్వే రంగంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. ఆధునికీకరణతో పాటు ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపరుస్తున్నాం. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా కృషి చేస్తున్నాం. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. వీటిలో స్లీపర్ వంటి సౌకర్యాలను కల్పించనున్నాం. కొత్త రైల్వే ట్రాక్‌లతో పాటు అండర్ బ్రిడ్జి నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. చర్లపల్లి టెర్మినల్ ద్వారా సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైళ్ల కోసం డిమాండ్ పెరుగుతోంది. దేశంలో 35 శాతం విద్యుదీకరణ పూర్తయింది. వందేభారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు తెచ్చాం. దశాబ్ద కాలంలో రైల్వే కొత్త రూపు సంతరించుకుంది. రైల్వేల ఆధునికీకరణ దేశం ముఖచిత్రాన్నే మారుస్తోంది." అని మోదీ చెప్పారు.

కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుంది: సీఎం రేవంత్‌రెడ్డి

చర్లపల్లి టెర్మినల్ ప్రారంభించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి డ్రైపోర్టు ఇవ్వాలని, ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. మెట్రో రైలు విస్తరణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం సహకరిస్తే తెలంగాణ ట్రిలియన్ ఎకానమీ సాధిస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# కాంగ్రెస్, బీజేపీకి కూడా గ్రీన్‌కో ఎన్నికల బాండ్లు ఇచ్చింది : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ఫార్ములా–ఈ కారు రేసు కేసులో విచారణ నిమిత్తం కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు చేరుకున్నారు. అయితే న్యాయవాదులతో కలిసి విచారణకు రావడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏసీబీ ఆఫీస్ ప్రధాన గేటు వద్దే కేటీఆర్ కారును అడ్డుకున్నారు. దీంతో సుమారు 45 నిమిషాలపాటు అక్కడే వేచి ఉన్నారు. తనను అడ్వకేట్ల సమక్షంలోనే విచారించాలని పట్టుబట్టారు. పోలీసులు అనుమతించకపోవడంతో విచారణకు హాజరు కాకుండా అక్కడి నుంచి వెనుతిరిగారు. అయితే ఈ క్రమంలో తన లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌ను ఏసీబీ డీఎస్పీకి అందించారు.

ఏసీబీ తనపై నమోదు చేసిన కేసులో తాను తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని అందులో ప్రస్తావించారు. అలాగే 'తనకు పంపిన నోటీసులు కేసుకు సంబంధించి తన నుంచి సమాచారంతోపాటు సంబంధిత పత్రాలను ఏసీబీ కోరింది. అయితే అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇవ్వలేదు. అవి ఎలాంటి పత్రాలో స్పష్టత ఇచ్చి.. తనకు కొంత సమయం ఇవ్వాలని అందులో కోరారు. అదేవిధంగా రాజ్యాంగం, చట్టం తనకు కల్పించిన హక్కులను వినియోగించుకుంటూనే.. కేసు దర్యాప్తునకు హాజరై సహరిస్తానని తెలిపారు. అయితే హైకోర్టులో తాను వేసిన క్వాష్ పిటిషన్ తీర్పు రిజర్వులో ఉందని, తీర్పు వచ్చేదాకా తనకు గడువు ఇచ్చే అవకాశం పరిశీలించాలని' ఏసీబీ డీఎస్పీ మజిద్ ఖాన్‌ని కోరారు.

## ఆరాంఘర్- జూపార్క్ పైవంతెనను ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

దీనిపై స్పందించిన ప్రభుత్వం ఫ్లైఓవర్ ప్రారంభానికి ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బంది పడటమే కాకుండా కోట్లాది రూపాయల ఇంధనం, విలువైన సమయం వృథా అవుతోంది. నగరంలోని ముఖ్యప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు జీహెచ్‌ఎంసీ వ్యూహాత్మకరహదారుల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా పైవంతెనలు, ఆర్వోబీలను నిర్మిస్తూ ట్రాఫిక్ ఇక్కట్లను దూరంచేస్తోంది. ఎస్ఆర్‌డీపీలోలో భాగంగా సుమారు రూ.800 కోట్లతో చేపట్టిన జూపార్క్– ఆరాంఘర్ పైవంతెన పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత నగరంలో రెండో అతిపెద్ద వంతెన.

# అఫ్గాన్‌కు మద్దతుగా భారత్.. పాక్‌పై మండిపాటు

మొదటిపేజీ తరువాయి

ఇంటర్నెట్ డెస్క్: అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులు చేసి పౌరులను పొట్టన



పెట్టుకుంది. అఫ్గాన్‌కు మద్దతుగా స్పందించిన భారత్ పాక్ చర్యపై తీవ్ర స్థాయిలో విరుచుపడింది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాక్‌కు అలవాటుగా మారిందని మండిపడింది.

మహిళలు, చిన్నారులు సహా అఫ్గాన్ పౌరులపై వైమానిక దాడులు జరగడం పట్ల భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. "అమాయక పౌరులపై దాడి జరిగితే భారత్ నిస్సందేహంగా ఆ చర్యను ఖండిస్తుంది. తమ అంతర్గత వైఫల్యాలకు పొరుగు దేశాలను నిందించడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారింది. ఈ అంశంపై అఫ్గాన్ అధికార ప్రతినిధి మాట్లాడిన విషయం కూడా మా దృష్టికి వచ్చింది" అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

కాగా.. అఫ్గాన్‌ను తాలిబన్‌లు ఆక్రమించుకున్న తర్వాత సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇటీవల తమ దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు తాలిబన్లే కారణమని పాకిస్థాన్ ఆరోపించింది. ఈ క్రమంలోనే గతేడాది మార్చిలో అఫ్గాన్‌పై దాడులు చేసిన పాక్.. మరోసారి డిసెంబర్‌లో వైమానిక దాడులతో విరుకుపడింది. తూర్పు పక్తికా ప్రావిన్స్‌లోని బార్మల్ జిల్లాలో నాలుగు గ్రామాలే లక్ష్యంగా దాడులు చేసింది.

ఇందులో దాదాపు 50 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. మరికొందరి పరిస్థితి విషమయంగా ఉన్నట్లు తాలిబన్ల ప్రభుత్వం వెల్లడించింది. తమ దేశంపై దాడులకు పాల్పడిన వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే అఫ్గాన్‌పై పాక్ దాడులపై విలేకరుల సమావేశంలో ఎదురైన ప్రశ్నకు భారత్ తరఫున రణ్‌ధీర్ జైస్వాల్ ఈ విధంగా స్పందించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం జనవరి 7 2025

# ఆంధ్రాలో హైందవ శంఖారావం

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

2025 జనవరి 5 వ తేదీన విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం విజయవంతమైంది.ఎక్కడ ఒక తోపులాట లేదు, ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బంది లేదు, మరెక్కడ మందు వాసన గోల లేదు, ఆహారం కోసం ఎగబడలేదు, ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చున్నారు, ఎక్కడ నిలబడమంటే అక్కడ నిలబడ్డారు. చెప్పింది చేశారు. చెప్పింది విన్నారు. సహనం పాటించారు. పెద్దలను గౌరవించారు. సమయం పాటించారు. ఇది హైందవ జాతి పద్ధతి అంటే అని చాటిచెప్పారు. మొన్న జరిగిన హిందూ శంఖారావం లో ఎన్నడూ జరగనిది ఇకముందు ఎవరూ చేయలేనిది చేసి చూపించారు.

**పనులన్నీ పక్కనబెట్టి...**
**ఎవరి టిక్కెట్ కు వాళ్ళే ఖర్చుబెట్టి...**

**కాషాయపు జెండ ఎత్తి...**
**సింధూరం నుదుట దిద్ది...**

**చీమలు పుట్టల్లోంచి పరుగులు తీసినట్టు...**
**నేలంతా కాషాయ కనకాంబరాలు పూసినట్టు...**

**నేలతల్లి బిలబిలమని ఈనినట్టు...**
**పొలిమేరలో పోలేరమ్మ పూనినట్టు...**

**ప్రతి మోములోనూ ఏదో ఆనందం...**
**ప్రతి మనసులోనూ ఎంతో ఆరాటం...**




**పలకరింపులు... పులకరింతలు...**
**కరచాలనాలు... ఆలింగనాలు...**

**హిందూ జాతి ఉగ్ర రూపమెత్తి పూరించిన శంఖారావం...హైందవ శంఖారావం...**
**ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ సభలను తలదన్నేలా, సెక్యులర్ మాయను ఛేధిస్తూ జరిగిన హిందూ**



**జాగరణ అపూర్వం.**
**ఇక హిందూ చైతన్యాన్ని ఎవ్వరూ ఆపలేరని లోకానికి చాటిన హైందవ శంఖారావం.**
**ఇక వివరాల్లోకి వెళితే..సభ తీర్మానాలు, డిక్లేరేషన్ ఈ విధంగా ఉంది.**

హైందవ శంఖారావం' హిందూ దేవాలయాలకు స్వయంప్రతిపత్తిని కోరింది దేవాలయాలు భక్తి కేంద్రాలుగా ఉండాలంటే ప్రభుత్వ జోక్యం ఉండకూడదని విశ్వహిందూ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు పట్టుబట్టారు.విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నిర్వహించిన 'హైందవ శంఖారావం' దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేయాలని హిందువులకు స్పష్టమైన పిలుపునిచ్చింది.జనవరి 5, 2025 (ఆదివారం) విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు మాట్లాడారు.'శంఖారావం' హిందూ సమాజం యొక్క సంకల్పం యొక్క సామూహిక ప్రకటన అని అలోక్ కుమార్ అన్నారు."ప్రజాస్వామ్యంలో ఏం జరగాలో ప్రజలే నిర్ణయిస్తారు. ప్రతి రాష్ట్రంలోని అన్ని హిందూ దేవాలయాలను తిరిగి హిందూ సమాజానికి అప్పగించాలని ప్రజలు నిర్ణయించారు" అని శ్రీ అలోక్ కుమార్ అన్నారు.జనవరి 5, 2025 ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు మాట్లాడారు.'శంఖారావం' హిందూ సమాజం యొక్క సంకల్పం యొక్క సామూహిక ప్రకటన అని అలోక్ కుమార్ అన్నారు.చల్లా కొండయ్య కమిషన్ సిఫార్సుల అమలు హిందూ



దేవాలయ వ్యవస్థకు వినాశకరంగా మారిందని ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆరుగురు సభ్యుల కమిషన్‌లో కేవలం ముగ్గురు మాత్రమే చట్టం రూపకల్పనలో పాల్గొన్నారని తెలిపారు."మన రాష్ట్రంలో, 20,000 దేవాలయాలకు కనీస ఆదాయం ఉంది మరియు ఎనిమిది మాత్రమే గణనీయమైన ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. 1987 చట్టం మన దేవాలయాలకు గట్టి దెబ్బ తగిలింది. ఎండోమెంట్స్ చట్టం ఆలయ అర్చకులకు పెద్ద దెబ్బ అని, ఆలయ వ్యవస్థకు విఘాతం కలిగించిందని అన్నారు.చట్టం అర్చకులను ఉద్యోగులుగా మార్చింది. పూజారులు ఉద్యోగులు కాదు, వారు తమ జీవితాలను దేవత సేవకు అంకితం చేస్తారు. వారిని ఉద్యోగులుగా పదవీ విరమణ చేయడం అన్యాయం. కేసు సుప్రీంకోర్టుకు వెళ్లగా, అర్చకులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. కానీ నేటికీ కోర్టు ఆదేశాలు పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. లౌకికవాదాన్ని మనం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇది మా ఉనికికి ఎప్పుడూ ముప్పుగా పరిణమించలేదు," అని శ్రీ సుబ్రహ్మణ్యం జోడించారు.అయోధ్యకు చెందిన గోవింద దేవగిరి మహారాజ్ స్వామీజీ మాట్లాడుతూ, రామమందిరాన్ని అసాధారణమైన ఆలయంగా నిర్మించామని, ప్రభుత్వం ఎటువంటి జోక్యం లేకుండా నిర్వహిస్తోందన్నారు. మరికొద్ది రోజుల్లో అయోధ్య ఆలయ ప్రతిష్ఠాపన మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది. "ఈ కార్యక్రమం ప్రజల భక్తి మరియు అంకితభావంతో జరుగుతోంది మరియు ప్రభుత్వ జోక్యం లేదు," అన్నారాయన.దేశమంతటా అలాంటి వాతావరణం నెలకొనాలి. దేవాలయాలు భక్తి కేంద్రాలుగా ఉండాలంటే ప్రభుత్వ జోక్యం ఉండకూడదు. హిందువులు తమ భక్తి మరియు అంకితభావంతో తమ దేవాలయాలను సమర్థవంతంగా నిర్వహించగలరు, "అన్నారాయన. వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. దేవాలయాలు హిందువులకు జీవనాధారమన్నారు. మనం వారిని రక్షించాలి. నాన్-విశ్వాసులు మరియు నాస్తికులు ఉద్యోగం చేయడానికి లేదా ఆలయ ట్రస్ట్ బోర్డులలో సభ్యులుగా పనిచేయడానికి అనుమతించకూడదు. ఇది జరగాలంటే దేవాలయాలకు స్వయంప్రతిపత్తి ఉండాలి.త్రిదండి రామానుజ శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామీజీ, భువనేశ్వరి పీఠం పీఠాధిపతి కమలానంద భారతీ స్వామీజీ తదితరులు మాట్లాడారు.

## తాడికల్ జిపిలో డిఎల్పిఓ శ్రీనివాస్ విచారణ...

**- విచారణలో సేకరించిన బాధితుల, గ్రామస్తుల అభిప్రాయాలను నివేదికల రూపంలో కలెక్టర్ కు నివేదిస్తాం..**
**- హుజురబాద్ డిఎల్పిఓ శ్రీనివాస్...**

**కరపత్రం శంకరపట్నం జనవరి 6**

కలెక్టర్ ఆదేశం మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తుల సమక్షంలో విచారణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హుజురాబాద్ డిఎల్పిఓ పాత శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా హుజురాబాద్ డిఎల్పిఓ శ్రీనివాస్ మాట్లాడారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం మండలం తాడికల్ గ్రామం నుండి ఎరడపల్లి మీదుగా వీణవంక మండలం చల్లూర్ వరకు



రహదారి విస్తరణ పనులు నిర్వహించడం జరుగుతుందని, రహదారి విస్తరణ లో తాడికల్ గ్రామంలో నివాస గృహాలు పోతున్నాయని కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో బాధిత కుటుంబ సభ్యులు విన్నవించుకోగా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాడికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తుల సమక్షంలో విచారణ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో గ్రామస్తుల ద్వారా సేకరించిన వాంగ్మూలాన్ని, అభిప్రాయాలను నివేదికల రూపంలో జిల్లా కలెక్టర్ కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కాసగొని ప్రభాకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి వీర ప్రతాప్, శంకరపట్నం మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు దొంగల రాములు, కీసర సుజాత సంపత్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఆడెపు అజయ్, తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఆరేపల్లి ఓదెలు, ఆడెపు రాజు, ఆడెపు ఓదెలు, ఆడెపు రాజ్ కుమార్, గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుల నిరసన

**కరపత్రం దినపత్రిక మెదక్ నర్సాపూర్**



రైతుభరోసా పేరిట సీఎం రేవంత్ అన్నదాతలకు చేసిన దగాపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నర్సాపూర్ చౌరస్తా లో బీఆర్ఎస్ శ్రేణులతో నిరసన చేయడం జరిగిందిఏటా రూ.15 వేలు రైతు భరోసా ఇస్తామని ఏడాది పాటు ఊరించి ఊరించి చివరికి 12 వేలే ఇస్తామని ఉసురు తీసిన ముఖ్యమంత్రి మోసానికి నిరసనగా రైతు డిక్లరేషన్ కాపీకి, గ్యారెంటీ కార్డులకు గొయ్యి తీసి బొందపెట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి తో పాటుగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మద్దతు తెలిపిన జమ్మికుంట నాయకులను అరెస్ట్ చేసిన హైదరాబాద్ పోలీసులు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జనవరి 6**

తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి అరెస్ట్ కు మద్దతుగా హైదరాబాద్ కు వెళ్లిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావులి ని మాదాపూర్ పోలీసులు అరెస్టు చేసి మోకిలా పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగింది..అరెస్టయిన వారిలో జమ్మికుంట పీ ఏ సీ ఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ,హుజూరాబాద్ ఎం పీ పి సురేందర్ రెడ్డి ,హుజూరాబాద్ పీ ఏ సి ఎస్ చైర్మన్ కొండల్ రెడ్డి ,పొనగంటి శ్రీదర్,పనికారి రమేశ్,రాజు,ప్రవీణ్, వీరితో పాటు 40 మందిని అరెస్ట్ చేసి పోలిస్ స్టేషన్ కి తరలించారు..

## కొత్త మండలాల ఏర్పాటులో చల్లూరు ఉండేనా...???

**- చల్లూరు గ్రామస్తుల కల నెరవేరేనా...??**

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, జనవరి 6.**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కొరకు, గ్రామాల అభివృద్ధి కొరకు, ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతూ, మండలాల ఏర్పాటుకు కసరత్తు చేపట్టింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా కొత్త మండలాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. వీణవంక మండలంలోని చల్లూరు గ్రామాన్ని మండలంగా మార్చాలని, గత ఐదేళ్లుగా ఆనాటి ప్రజా ప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, చల్లూరు మండల ఏర్పాటుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. బి ఆర్ ఎస్ మాజీమంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీష్ రావు



చల్లూరు మండలంలో మారుస్తామని, హుజురాబాద్ బై ఎలక్షన్ ప్రచారంలో హామీ ఇచ్చారు. చల్లూరు గ్రామం అన్ని రకాలుగా భౌగోళికంగా, ప్రకృతి వనరులు, రవాణా, వ్యాపారం, మౌలిక సదుపాయాలు కలిగి పుష్కలమైన నీటి వనరులతో సకల సౌకర్యాలు ఉన్నయని, చల్లూరు మండలాన్ని చేసినట్లయితే, అన్ని రకాలుగా అన్ని గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని, ఉపాధి అవకాశాలు, మరిన్ని పెరుగుతాయని, పరిపాలన సౌలభ్యం సులువు అవుతుందని, మేధావులు, విద్యావేత్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు,యువకులు, వ్యవసాయదారులు , వ్యాపారస్తులు సంయుక్తంగా చల్లూరు మండలం ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.

## బిజెపి కార్యాలయాల ముట్టడి విజయవంతం

**- కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్లో అంబేద్కర్ అవమానించినందుకు జాతీయ మాల మహానాడు నిరసన ర్యాలీ**
**- మమ్ములను అరెస్టులు చేస్తే భయపడేది లేదు ఎన్ని పోరాటాల కైనా సిద్ధం**
**- వెంటనే అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేసిన**
**- జాతీయ మాల మహానాడు అధ్యక్షులు జి.చెన్నయ్య మాల మహానాడు జేఏసీ నాయకులు**

**కరపత్రం దినపత్రిక సంగారెడ్డి/ హైదరాబాద్ ప్రతినిధి:**

ఇటీవల ఢిల్లీలో పార్లమెంట్ సాక్షిగా పార్లమెంట్లో కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా పార్లమెంట్లో బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ ను అవమానించిన యావత్ భారత దేశ దళిత బహుజన ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరించిన తీరుకు నిరసనగా మాల సంఘాల జేఏసీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త బిజెపి కార్యాలయాల ముట్టడిలో భాగంగా నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయాన్ని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి చెన్నయ్య నాయకత్వంలో పెద్ద ఎత్తున మాల సంఘాల నాయకులు కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి బిజెపి కి అమిత్ షా కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ కో చైర్మన్ లు బూర్గుల వెంకటేశ్వర్లు,చెరుకు రాంచందర్, గోపోజు రమేష్,ఎస్ నాను, కె.ఇందిరా,తాలూకా అనిల్ గాజుల నాగరాజు గోకుల్ కళ్యాణ్,దాసరి భాస్కర్ ,బొట్టు బాలకృష్ణ, ప్రభాకర్, ఆకాశ్,కె బి రాజు, రామ్మోహన్ తదితరుల ను అరెస్టు చేసి కాంచన్ బాగ్ పోలీసు స్టేషన్ కు తరలించారు.

## ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి..!

**- ఆదివరాహస్వామి క్షేత్రంలో స్వామి వారి ఉత్తర ద్వారా దర్శనం**

**కరపత్రం రామగిరి ప్రతినిధి జనవరి 6:**

ఈనెల 10న శ్రీ ఆదివార స్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో కె కాంతరెడ్డి తెలిపారు.

కమాన్ పూర్ మండల కేంద్రంలోని స్వయంభు పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి క్షేత్రంలో ఈనెల 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శనార్థం భక్తులు చేసుకున్నందుకు ఆలయ కార్యనిర్ణాధికారి కాంత రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివరహా క్షేత్రంలోని కళ్యాణ మండపంలో ప్రత్యేకంగా ఉత్తర ద్వారం నుండి భక్తులు ప్రవేశించి సప్త ద్వారాల గుండా స్వామివారిని అమ్మవార్లను దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయనున్నారు. పాల కడలిలో దేవత మూర్తుల ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి



స్వామివారి దర్శనం చేసుకునే విధంగా భక్తులకు సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ముక్కోటి ఏకాదశి రోజున స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని కోరిన కోర్కెలు కోరుకొని శుభప్రదం పొందగలరని ఆలయ కార్యనిర్ణ అధికారి కొసనకాంతరెడ్డి కోరారు.

## రామగుండం టౌన్ ప్లానింగ్ ఏసిపిని వెంటనే సస్పెండ్ చేయాలి

- చర్యలు తీసుకోపోతే కార్పోరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య హెచ్చరిక

**కరపత్రం రామగుండం జనవరి, 06:**



రామగుండం కార్పొరేషన్ పరిధి కాశిపల్లి లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అక్రమంగా నిర్మించిన హెూటల్ శ్రీమయి లగ్జరీ వెనకాల నూతన భవనాన్ని తొలగించాలని రామగుండం నగరపాలక సంస్థ ఇన్చార్జ్ కమిషనర్ అరుణశ్రీ కి ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులలో చలనం లేదని, అక్రమ నిర్మాణాలకు అండగా ఉన్న టౌన్ ప్లానింగ్ దిష్టిబొమ్మను స్థానిక చౌరస్తాలో దగ్ధం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సంధర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య మాట్లాడుతూ " రామగుండం కార్పొరేషన్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ అనుమతులు మంజూరు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.కార్పొరేషన్ పరిధిలోని కాశి పల్లి లో శ్రీ మై లగ్జరీ హెూటల్ వెనకాల ఒక పెద్ద భవనం నూతనంగా నిర్మాణం జరిగిందని ఆ యొక్క భవనానికి ఎలాంటి సెల్లార్ అనుమతులు తీసుకోకుండా గ్రౌండ్ ఫ్లోర్ అనుమతితో అక్రమంగా సెల్లార్ను నిర్మించడం జరిగిందని మరి అనుమతి ఇవ్వడానికి ఆ భవనాన్ని సందర్శించిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఏ విధంగా అనుమతిచ్చారు తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ నిర్మాణం జరుగుతున్నప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకొని టౌన్ ప్లానింగ్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు నూతన మున్సిపల్ చట్టం 2019 సెక్షన్ 174(5), 178(1) మరియు 181(2) ప్రకారం ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని రామగుండం కార్పొరేషన్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా అవినీతికి పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నూతన భవనం నిర్మాణం జరుగుతున్న సందర్భంలో ఇన్స్పెక్షన్ కి వెళ్లకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు భవనం పూర్తయిన అనంతరం అన్ఆథరైజ్డ్ కన్స్ట్రక్షన్ పెనాల్టీ వేసి చేతులు దులుపుకోవడం సరి అయిన చర్య కాదని అన్నారు. అనుమతి లేకుండా చిన్న రేకుల షెడ్డు వేసుకుంటేనే హుటాహుటిన టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నిర్మాణాలను కూలగొడుతున్న అధికారులకు పారిశ్రామిక ప్రాంతంలో ఇంత పెద్ద భవనం అక్రమ నిర్మాణం అని తెలిసిన ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం అధికారుల అవినీతికి నిదర్శనమని అన్నారు కార్పొరేషన్ ప్రాంతంలో ఉన్నోళ్లకు ఒక చట్టం లేనోళ్లకు ఒక చట్టం లాగా కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు వ్యవహరించడాన్ని తప్పుబట్టారు.కాశిపల్లి లో అక్రమంగా నిర్మాణం జరుగుతున్న భవనంపై వెంటనే చర్యలు తీసుకోకపోతే రామగుండం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆరేపల్లి మానస్ కుమార్ నగర కార్యదర్శి ఆశాల నవీన్ నాయకులు రాణవేణి సుధీర్, వినయ్, పోతరాజు నాగరాజు, నాగరాజు ,నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు

## పి. ఆర్. టి .యు .టి. ఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన రిటైర్డ్ ఎంఇఓ ఛాయాదేవి మండల నోడల్ అధికారి ప్రభాకర్



**కరపత్రం ధర్మారం జనవరి 06:**

పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కెబద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఆవరణలో పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్షులు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పి ఆర్ టి యు టీఎస్ క్యాలెండర్ ను తాజారిటైర్డ్ ఎంఈఓ పి.ఛాయాదేవి మరియు మండల నోడల్ ఆఫీసర్ పోతు ప్రభాకర్ గారి చేతుల మీదుగా నూతన 2025 సంవత్సరం క్యాలండర్ ను ఆవిష్కరించరు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ : ఉపాధ్యాయుల అపరిస్కృత సమస్యల పరిష్కారం కోసం పి.ఆర్.టియు టి.ఎస్ మరింత పోరాటాలు చేయాలని,సంఘ సభ్యులందరికీ నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ మండల అధ్యక్షులు జాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గంకిడి రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవి రమేష్, మండల ఉపాధ్యక్షులు చక్రవర్తి శ్రీనివాస్ , కార్యదర్శి రమేష్ నాయక్, ధర్మారం హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీమతి మాలతిలత హెచ్ఎంలు ఎస్.మల్లారెడ్డి కాటం మదునయ్య,అరుణమేడం ఉపాధ్యాయులు కాట నరసయ్య, రమేష్ నాయక్, శ్రీనివాస్, సునీల్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే టోర్నీకి పాలకుర్తి కేజీబీవీ విద్యార్థులు ఎంపిక..



**కరపత్రం రామగుండం జనవరి, 06:**

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కేంద్రంలోని పాలకుర్తి మండల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల కు పలువురు విద్యార్థులు సోమగూడంలో జరిగిన దృకెన్ కుంగ్, ఫు ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్తాయి కరాటే టోర్నమెంట్లో పాలకుర్తి మండలం కేజీబీవీ కి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో గోల్డ్ మెడల్స్ 6,సిల్వర్ 6, బ్రోనజ్ 5సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ లుఉత్తమ జాతీయ కుంగ్ ఫు అవార్డు గ్రహిత కే, సదానందం అభినదిచారు. అనంతరం కేజీబీవీ స్కూల్ యాజమాన్యం ఇంచార్జి ఎస్ ఒ కవిత, ఎం ఈ ఓ విమల,సాహితి, భావన, సుమతి,పీటీ సుజాత మాట్లాడుతూ మెడల్స్ సాధించిన విద్యార్థులు జాతీయస్థాయి టోర్నకి ఎంపిక అయ్యారని ఎంపికైన విద్యార్థులకు శు భాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థులు చదువుతో పాటు ఆత్మరక్షణలో భాగంగా సెల్ఫ్ డిఫెన్స్లో (కరేట్ )లో ప్రావీణ్యం పొందాలని పాఠశాల యాజమాన్యం, మాస్టర్స్ రామ్ లక్ష్మీన్ కోరారు.చదువుపూర్తి అయ్యాక ఉద్యోగంలో కూడా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చని వారు తెలిపారు.

## జర్నలిస్టులకు ప్రత్యామ్నాయం డబ్ల్యూజేఐ మాత్రమే...

- అధ్యక్ష, కార్యదర్శులు రాణా ప్రతాప్, రావికంటి

**కరపత్రం న్యూస్ హైదరాబాద్: జనవరి, 6**





రాష్ట్రంలో ఇతర జర్నలిస్టు సంఘాలకు ప్రత్యామ్నాయం తామేనని, దేశ కార్మిక రంగంలో బలమైన శక్తిగా ఉన్న బిఎంఎస్ ఆధ్వర్యంలోని తమ సంఘం మాత్రమే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పెద్ద దిక్కులా నిలుస్తుందని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర శాఖ, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాణా ప్రతాప్, రావికంటి శ్రీనివాస్ తెలిపారు.రాష్ట్రంలో సంఘ నిర్మాణం కోసం జరుగుతున్న ప్రయత్నాలు, త్వరలో నిర్వహించనున్న జర్నలిస్టుల రాష్ట్రస్థాయి పురస్కారాలు, అక్రిడిటేషన్ల సమస్యలపై అనుసరించాల్సిన విధానాలపై సోమవారం హైదరాబాదులో రాష్ట్ర బాధ్యులతో కలిసి చర్చించారు.యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నందనం కృపాకర్, ఉపాధ్యక్షులు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివనాద్రి ప్రమోద్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు బాలకృష్ణ, పవన్ ఈ భేటీలో పాల్గొన్నారు. హైదరాబాద్ లోని పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యాలయాల్లో యాజమాన్య ప్రతినిధులు, ముఖ్య కార్యనిర్వహణాధికారులను కలుసుకొని డబ్ల్యూజేఐ సిద్ధాంతాలను వివరించడం,జర్నలిస్టుల అవార్డులకు సంబంధించిన కార్యక్రమానికి వారి నుంచి సహకారం కోరడంలో హైదరాబాద్ శాఖ సభ్యుల కృషిని ప్రశంసించారు. గత రెండు రోజుల వ్యవధిలో కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ లను కలుసుకొని అక్రిడిటేషన్ కమిటీలలో డబ్ల్యూజెఐ ప్రతినిధ్యం కోసం ప్రభుత్వానికి సిఫారసు చేయాలన్న వినతికి వారు సానుకూలంగా స్పందించడాన్ని స్వాగతించారు.ఇప్పటికే యూనియన్ నాయకత్వం పర్యటించిన జిల్లాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, ఇంకా సంఘ కార్యకలాపాలు ప్రారంభించని జిల్లాలలో సమావేశాలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా కార్యవర్గంలోని సభ్యులు పనిచేయాలని సూచించారు.రాష్ట్ర రాజధాని కేంద్రంలో జర్నలిస్టుల స్థితిగతులు, వారిపై జరుగుతున్న దాడులు, నివారణ మార్గాలపై త్వరలో ఒక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలన్న అభిప్రాయానికి వచ్చారు.20 వరకు దరఖాస్తులకు ఆహ్వానం...జర్నలిస్టులలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, ఉత్తమ జర్నలిస్టులను ప్రోత్సహించేందుకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జర్నలిస్టుల పురస్కారాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కనుక సోమేశ్వర కొండ కింద మహా అన్నదాన వితరణ



**కరపత్రం జనవరి 06**

తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో కల అతి పురాతన ఏకశిలా పర్వతంపై స్వామివారు స్వయంభుగా వెలసిన ఎంతో ప్రాశస్త్యం గల శ్రీ కనకసోమేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రతి సోమవారం మహా అన్నదాన ప్రసాద వితరణ జరుగుతుంది ఈరోజు సరిగ్గా అన్నదాన కార్యక్రమం మొదలై పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాలం కావస్తున్నందున అలాగే ఇట్టి ఆచారానికి ప్రతి సంవత్సరం మొదటి సోమవారం రోజున అన్నదాత అయినటువంటి బండారి రమేష్ దంపతుల చేతుల మీదుగా ఈ సంవత్సరం మొదటి సోమవారం అయినా ఈరోజు ఆ పుణ్య దంపతుల చేతుల మీదుగా మహా అన్నదాన ప్రసాద వితరణ జరిగినది భక్తుల భజనల మధ్య ఇట్టి కార్యక్రమం జరిపిన రమేష్ దంపతులను దేవాలయ కమిటీ వారు శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో దేవాదాయ కమిటీ చైర్మెన్ సంఘ గంగారాజం మాట్లాడుతూ ప్రతి సోమవారం స్వామివారి అన్న ప్రసాదనకు దాతల రూపంలో ఉన్న మహా భక్తులను పేరుపేరునా అభినందించినారు ఇట్టి కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు బలిజేపల్లి ప్రభాకర్ శర్మ దేవాదాయకమిటీ చైర్మన్ సంఘ గంగరాజము సామాజిక సేవకులు రుద్ర రాంప్రసాద్ డాక్టర్ రాజా గంగారాం ముష్కరి రమేష్ సుంకె ట జీవన్ సూర దివాకర్ చిప్ప శంకర్ ముత్యాల రమేష్ తొట్ల భూమారెడ్డి భక్తజనులు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాదిగల రథయాత్ర...

**కరపత్రం గన్నేరువరం జనవరి 6**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా అలుగునూర్ నుండి జనవరి 8న ప్రారంభం కానుంది.ఇట్టి కార్యక్రమాన్ని, రమంచ భారత్ మాదిగ కళామండలి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి.ఈ కార్యక్రమంలో ముఖ్యధితులుగా పాల్గొన్న మాదిగ కళామండలి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి ప్రజా గాయకుడు రామంచ భరత్ గారు మాట్లాడుతూ.ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ గారి పులుపు మేరకు, వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏపూరి సోమన్న గారి నేతృత్వంలో ఫిబ్రవరి 7న నాడు హైదరాబాద్ లో జరగబోయే వెయ్యి గొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం జనవరి 8న అలుగునూర్ నుండి మాదిగ కళాకారుల రథయాత్ర ప్రారంభం అవుతుంది అన్నారు.-హక్కుల కోసం మొదటిసారి డప్పులు కొడుతున్నం -జనవరి 8 నుంచి కళానాయకుల కవాతు -మాదిగలంతా పాల్గొని విజయవంతం చేయాలి ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ జెండా పట్టుకుని మందకృష్ణ మాదిగ పోరాడు తున్నారని, వారు చేపట్టిన కవాతుకు మద్దతుగా మాదిగలంతా సహకరించాలని, ప్రజా గాయకుడు రామంచ భరత్ పిలుపునిచ్చారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు వర్గీకరణకు మద్దతు తెలిపారని, అన్నారు. ఎస్సీలలో ఉన్న 59 కులాల్లో కేవలం ఒక కులం మాత్రమే వ్యతిరేకంగా ఉందని అన్నారు. అన్ని ఉద్యమాల్లో, రాజకీయ పార్టీల గెలుపు ఓటములలో మాదిగ కళాకారుల పాత్ర ఉందని అన్నారు. ఎన్నో మంచి చెడులలో ఎందరికో డప్పు కొట్టి పాట పాడామని, ఇప్పుడు మొట్టమొదటిసారిగా తమ హక్కుల సాధన కోసం డప్పులు కొట్టబోతున్నామన్నారు. జనవరి 8 నుంచి- ఫిబ్రవరి 7వరకు వెయ్యి గొంతుల- లక్ష డప్పులు కళానాయకుల కవాతు కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రారంభించనున్నారని తెలిపారు. ఎమ్మెస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాట్లాడుతూ ఈ కవాతు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, మాదిగ మేధావులు, ఉద్యోగులైన జాతి బిడ్డలను గౌరవించుకుంటూ వారిని సన్మానం చేస్తానని అన్నారు. అలాగే అమరులైన మాదిగ అమరవీరులకు నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చేస్తానని హామీ ఇవ్వడంతో బలమైన ఆకాంక్షను తెలియజేసేందుకు మొదటిసారి తమ హక్కుల కోసం డప్పు కొట్టబోతున్నట్లు తెలిపారు. అందుకోసం ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా పరిధిలోని మాదిగలు, మాదిగ ఉపకులాల కళానాయకులంతా విధిగా పాల్గొనాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బెజ్జంకి అనిల్ మాదిగ ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు. ఎం ఎస్ పి రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు బోయిని కొమురయ్య మాదిగ,మాదిగ కలమండలి జిల్లా అధ్యక్షులు అంబాలా ప్రభాకర్ మాదిగ, మాదిగ కళ మండలి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి రామంచ భారత్ మాదిగ, గన్నేరువరం మండల అధ్యక్షులు రేపాక బాబు మాదిగ, ఉపాధ్యక్షులు కళ్లేపల్లి సురేష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి రామంచ సతీష్ మాదిగ, కార్యదర్శి వేధిర ఐలయ్య మాదిగ,సంయుక్త కార్యదర్శి వేధిర రాజకుమార్ మాదిగ,గన్నేరువరం టౌన్ అధ్యక్షులు రామంచ సంపత్ మాదిగ, ఎం.ఎస్.పి మండల అధ్యక్షులు బొడ్డు శ్రీనివాస్ మాదిగ, మాతంగి అనిల్ మాదిగ, మండల మాదిగ కుల బంధావులు పాల్గొన్నారు.